చదువు కావాలి

"చదువొద్దు గిదువద్దు" తండ్రి సాయన్న అన్నాడు.

తలవంచుకుని నిలుచున్నది పదేండ్ల కూతురు వసంత.

"దీని పెండ్లి చేస్తే" పందిట్లో నిలుచోని అన్నాడు.

"నా పని అయిపోతది" తలుపుచాటునుండి తల్లి అన్నది.

"అంతే కదా" తండ్రి. అన్నాడు.

"చిన్న పిల్లే కద, ఇంకా చదవనీ" తల్లి చెప్పింది.

"సదివింది సాలు. ఉద్యోగం సేసేదుందా, ఊళ్లేలేదుందా" తండ్రి అన్నాడు.

"ఇప్పుడె ఎట్లచెపుతం, సొంతం చదివితె దానికి దగ్గది దానికి దొరకదా" తల్లి అన్నది.

"దొరకదు, సదవద్దు. పెండ్లి చేద్దా అంతే"

తల్లి మాట్లాడలేకపోయింది. కూతురు వైపు చూసింది.

తలవంచుకుని నిలుచున్న వసంత కళ్లనుండి కన్నీటి చుక్కలు కిందరాలాయి. అది చూసి తల్లి దుఃఖితురాలైంది. తమ పేదరికం మీద తానే ఈసడించుకుంది.

"నా మాటకు తిరుగులేదు. అంతే" అంటు బయటికి నడిచాడు.

పొద్దు పొడిచి బారెడెక్కింది.

సాయన్న యింటిచుట్టు ఆ వూరి బడిపిల్లలు కూర్చున్నారు.

"ఏందిదంత" సాయన్నచిరాకు పడ్డాడు.

ఎవరు చప్పుడు చేయలేదు. అప్పటివరకు వసంత ఇంట్లోనేవున్నది. తండ్రి లోపలవైపు చూస్తు "ఏమే ఏమెరగనట్టు ఇంట్ల వుండి ఈ కోతుల దండును బయటుంచినవా" అన్నాడు.

వసంత చప్పుడు చేయలేదు.

ఆ మాటవిన్న బయటి పిల్లలు చప్పుడు చేయలేదు.

"జరగండి నేను పనిమీద పోవాలె"

పందిరికింద పిల్లలు మౌనంగా కూర్చున్నారు.

"ఇదేమిటి"

ఎవ్వరు చప్పుడు చేయలేదు.

"ఈ కఱ్ఱతో మిమ్ములను కొడతను జాగ్రత్త" అంటు చేతిలోకి కఱ్ఱను తీసుకున్నాడు.

అందరు ఒకేసారి లేచారు.

సాయన్నకు ఒక్కసారే వళ్లు జలదరించినట్లైంది.

రెప్పపాటున ఒకరికొకరు సైగ చేసుకుని అందరు వరుసగ వంగుతు కొట్టమన్నట్టు చూశారు.

ఈసారి సాయన్న బిత్తరపోయాడు.

అందరు ఒకేసారి "వసంతను బడికి పంపాలి" అన్నారు.

సాయన్నకు ఎటు తోచలేదు.

మళ్లి అదేమాట "వసంతను బడికి పంపాలి" అన్నారు.

సాయన్న వసంత వైపు కోపంగ చూశాడు. వసంత తల్లిపై

పళ్లు కొరికాడు. "మళ్లీ వసంతను బడికిపంపాలి" అనగానే పిల్లలవైపు చూశాడు.

"వసంత చాల క్లవరు. చదివించాలి".

"వరె పిల్లసన్నాసుల్లారా, ఈ ఏడు తరువాత, ఆ పైచదువు మన ఊళ్లో లేదే. అప్పుడైనా"

"పక్కూర్లో ఇంటర్‌వరకుంది".

మరి తిండి బట్ట అన్నట్టు కడుపును తాకుతు అన్నాడు.

"అన్ని అవె వస్తయి" అంటు వంగివున్న విద్యార్థులు నిలుచున్నారు.

"నాకైతే అర్థం కాలే"

"తిండి బట్టకు హాస్టల్ వున్నది. పుస్తకాలు ప్రభుత్వమే ఇస్తుంది".

సాయిలు నీళ్లు మింగుతు నిలుచున్నాడు.

"మీరు సరే అంటే మేం వెళ్లిపోతము. లేదంటే ఇక్కడెవుంటం"

"ఉండండి ఎన్ని రోజులుంటరో"

"ఎన్ని రోజులైన వుంటం".

'ఓరి పిడుగుల్లారా!. అంత అనుకొని కట్ట కట్టుకొనే వచ్చారన్నమాట' అనుకున్నాడు.

ఈలోపు అందరు చేతులు జోడించి "వసంతను బడికి పంపించాలి" అన్నారు.

వసంత వైపు, వసంత తల్లి వైపు కోపంగచూసి, పిల్లలవైపు కాస్త ప్రేమను నటించాడు. చేసేది లేక "సరె" అన్నాడు.

అందరు కలిసి వసంతను తీసుకుని వెళ్లిపోయారు.

తోవలో ఈ ప్లాన్ యిచ్చిన వసంత వాళ్ల క్లాస్‌టీచర్ కలిసి "శభాష్ సక్సెస్" అని దగ్గరవున్న వాళ్లతలలు నిమిరి, ఇకపదండి

అంటు స్కూల్ వైపు నడిచారు.

"ఐకమత్యం, మంచితనం, ఎంతటిపనినైనా చేయిస్తుంది" అన్నాడు టీచర్. అవును అనుకుంటు టీచర్ వెనకాల నడుస్తున్నారు.

"ఈ ఆయుధంతోనే గాంధీగారు తెల్లదొరలను గెలిచాడు" అన్నప్పుడు పిల్లల్లో ఏదో కొత్త వుత్సాహం కదిలింది. ఈ లోపు టీచర్ "ఇప్పటివాళ్లు చీటికిమాటికి, అయిందానికి కానిదానికి ఈ ఆయుధాన్ని ఉపయోగించి అరాచకాలను సృష్టిస్తున్నారు. అంతేకాదు వాళ్ల ప్రయోజనాలకోసం విద్యార్థులను గూడ ఊరేగింపులో దింపి అటు చదువును ఇటు నైతిక విలువలను చెడగొడుతువున్నారు. కాబట్టి మీ తరం పిల్లలు చాల జాగ్రత్తగ మంచి చెడులను గమనించి నడవాలి సుమా" అని అంటున్నప్పుడు శ్రద్ధగ వింటున్నారు పిల్లలు.